క్లుప్తంగా

'వ్యక్తిగతంగా కక్షకట్టారు'

టెక్కలి: తనకు సంబంధం లేని విషయాలను అంటగట్టి కక్షతో కొన్ని పత్రికల్లో కల్పిత కథనాలు సృష్టించి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నారని టెక్కలి పట్టణానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి బి.ధనుంజయ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన పోలింగ్‌లో తాను ఓటు వేసేందుకు వెళ్తే.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ప్రచారం చేశానంటూ కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించారని పేర్కొన్నారు. తన గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నీ విజేత టెక్కలి


విజేతగా నిలిచిన టెక్కలి జట్టు క్రీడాకారులు

సంతబొమ్మాళి: మండలంలోని ఉమ్మిలాడ గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు విజేతగా టెక్కలి జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్‌లో సున్నాపల్లి, టెక్కలి జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన సున్నపల్లి జట్టు 78 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన టెక్కలి జట్టు లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచి టెక్కలిజట్టుకు రూ. 50 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

- కొత్తపల్లి పాఠశాల ఉపాధ్యాయుల ఇంటింటా ప్రచారం


విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మందస మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్. గణేశ్వరరావు నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం ముకుందపురం తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వివరించారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని, మౌలిక వసతులు బాగున్నాయని తెలియజేశారు. ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, మజ్జి చిత్రసేను, బోనెల రమేష్ ఉన్నారు.

శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరావు

సోంపేట: ఉద్దానం ప్రాంతంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్న స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు, భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిలేషన్ అడ్వయిజర్ దుద్ది శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు క్రిస్టియన్ యూనివర్సిటీ యూఎస్‌ఏ తరఫున బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్‌ను శ్రీనివాసరావుకు అందజేశారు. డాక్టరేట్ అందుకున్న శ్రీనివాసరావును రోటరీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్దానం ప్రాంత ప్రజలు హర్షం వెలిబుచ్చారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం


సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు బి.నారాయణ కుటుంబానికి అండగా నిలిచారు. నారాయణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్నేహితులంతా రూ. 46, 000 సేకరించారు. ఈ మొత్తాన్ని నారాయణ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

విజయం మనదే

- విజయోత్సవాలకు సిద్ధంకండి
- ఎన్నికల్లో కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకూ ధన్యవాదాలు
- టెక్కలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్


మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అధిక ఓట్లు పడడం ద్వారా ఘన విజయం సాధించడం ఖాయమని టెక్కలి నియోజకవర్గ పార్టీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలిలో కూడా ఘన విజయం సాధిస్తామని చెప్పారు. జూన్ నాలుగో తేదీన విజయోత్సవాలు జరుపుకోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోటబొమ్మాళిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలపై బూత్ వారీగా బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీగా ఓట్లు పడ్డాయన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మహిళలు, వృద్ధులు, అన్ని వయసులు..అన్ని వర్గాలవారూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రాత్రి వేళలో సైతం పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలైన్లలో గంటల తరబడి నిల్చొని ఓట్లు వేశారన్నారు. భారీగా పోలింగ్ శాతం పెరగడం వైఎస్సార్‌సీపీ విజయానికి సంకేతమన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా రాణి, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.మసుంధరరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళిధర్, పార్టీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, చింతాడ వరుణ్, కింజరాపు అప్పన్న, చింతాడ అనిరుద్రుడు, రాంపాత్రుని సావిత్రి, గొండు చాందిని, వాన అసిరినాయుడు, అల్లు కల్యాణి, కాళ్ల సంజీవరావు, జి.నాగభూషణరావు, కమ్మకట్టు శ్రీనివాసరెడ్డి, సుంకరి జనార్దన, రెడ్డి లక్ష్మణ, దుక్క రామకృష్ణ, మెట్ట సింహాచలం, నేతింటి సింహాచలం, వాన ఆదినారాయణ పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

- డీపీఎంవో వెంకటలక్ష్మి


ఆశావర్కర్లతో సమీక్షిస్తున్న డీపీఎంవో వెంకటలక్ష్మి

ఇచ్ఛాపురం: అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని జిల్లా కార్యనిర్వాహణ అధికారి (డీపీఎంఓ) వెంకటలక్ష్మి అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పనితీరుని మెరుగుపర్చుకునేందుకు అవసరమయ్యే సలహాలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని ఓ ఆస్పత్రిని సందర్శించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రిని నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఓ నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి (డీపీహెచ్‌ఎన్‌ఓ) శైలజ, స్థానిక యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం అఖిల్ మనోహర్ ఉన్నారు.

ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


ఎం.రాధిక


పి.దుర్గాప్రసాద్‌రెడ్డి


మావిడి జగన్నాథశర్మ


దున్న లిఖిత

ఇచ్ఛాపురం రూరల్: మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. ఈదుపురం(ఆర్) ప్రాథమిక పాఠశాల నాలుగో తరగతి విద్యార్థిని మగుబారి రాధిక ఇటీవల నిర్వహించిన ఏపీఆర్‌ఎస్ ఐదో తరగతి అర్హత పరీక్ష రాయగా.. బుధవారం విడుదలైన ఫలితాల్లో అర్హత సాధించినట్టు ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు మార్కెండేయ బిసాయి తెలిపారు. అలాగే పి.దుర్గాప్రసాద్‌రెడ్డి ఏపీఆర్‌జేసీకు అర్హత పరీక్షలో 93వ ర్యాంకు సంపాదించినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్ స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో పదో తరగతి చదివి ఉత్తీర్ణత సాధించాడు. ఎం.తోటూరు సత్యసాయి హైస్కూల్‌కు చెందిన పైలా సాయికృష్ణారెడ్డి ఏపీఆర్‌జేసీ అర్హత పరీక్షలో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించినట్లు పాఠశాల చైర్మన్ సాహుకారి కృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులను ఎంఈవో కురమాన అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నందిగాం: నర్సిపురం గ్రామానికి చెందిన మావిడి జగన్నాథశర్మ ఏపీఆర్‌జేసీలో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గ్రామానికి చెందిన పురోహితులు మావడి సింహాచలం శర్మ, శ్రీలక్ష్మీ దంపతుల మూడో కుమారుడైన జగన్నాథశర్మ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 509 మార్కులు సాధించాడు. అలాగే ఏపీఆర్‌జేసీలో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకుతో రాణించాడు. విద్యార్థి సాధించిన ప్రతిభపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వజ్రపుకొత్తూరు: పెద్ద పల్లివూరు గ్రామానికి చెందిన దున్న లిఖిత ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 110 మార్కులు సాధించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో 111వ ర్యాంక్ సాధించింది. పూండిలోని వివేకానంద విద్యా సంస్థల్లో పదో తరగతి చదివింది. లిఖితను పాఠశాల డైరెక్టర్ పేరాడ సోమేశ్వరరావు, ప్రిన్సిపాల్ డి.వనజనాభం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న సంఘ సభ్యులు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో నివాసముంటున్న ఓ నిరుపేద కుటుంబానికి టెక్కలికి చెందిన అభయం యువజన సేవాసంఘం సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ కాలనీ ఐదో లైన్‌లో నివాసముంటున్న యువకుడు శ్రీరాములు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న సేవా సంఘం సభ్యులు ఒక బియ్యం ప్యాకెట్‌తో పాటు నిత్యావసర సరుకులను అతని కుటుంబానికి అందజేశారు. అలాగే ఆర్మీ ఉద్యోగి నెయ్యిల ఈశ్వరరావు కూడా కొంత సాయం చేసినట్టు పేర్కొన్నారు. యువజన సేవాసంఘం సభ్యులు ధర్మవరపు పూర్ణాచార్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న కామ్రేడ్ శ్రీరాములు సంస్మరణ సభ



మాట్లాడుతున్న మోహన్‌రావు

వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి గ్రామంలో ఈ నెల17వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు కార్మిక, కర్షక, గిరిజన సంఘం ఉద్యమ నేత, సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్టు సీపీఎం నాయకులు నెయ్యిల మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు అదే గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. 70 ఏళ్ల పాటు ఉద్యమ నేతగా బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటన్నారు. సంస్మరణ సభలో పలువురు రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు బి.ఆనందరావు, టి.భాస్కరరావు,బి.రామకృష్ణ ఉన్నారు.

గోవులకు పర్ణశాల ఏర్పాటు


గోవులకు ఏర్పాటు చేసిన పర్ణశాల

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడం గ్రామం శివారు ప్రాంతం పాతజాతీయ రహదారి పక్కన ఉన్న గోసంరక్షణ కేంద్రంలో పర్ణశాలను ఏర్పాటు చేశారు. దాతల సాయంతో నడుస్తున్న గోశాల వద్ద ఆవులు వేసవితాపానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్నతో దాతలు పర్ణశాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. తొమ్మిది వేల రూపాయలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఎదురు కర్రలతో పందిళ్లు వేసి సొప్పగడ్డితో నేసి గోవులకు నీడను కల్పించారని నిర్వాహకులు లక్కోజి ధర్మారావు తెలిపారు. గోవుల సంరక్షణకు ముందుకు వచ్చిన దాతలు, సేవకు హాజరైన వారి కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంకన్న కల్యాణానికి పందిరిరాట


పందిరిరాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలోని చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు పందిరిరాట మహోత్సవం బుధవారం జరిగింది. ఈనెల 18న వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ వేద మంత్రాల నడుమ పందిరిరాట ఉత్సవాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో సహ అర్చకులు నవీన్ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి ఉత్సవాలకు వేళాయె


ముత్యాలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి పండుగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని గీతాంజలి స్కూల్ సమీపంలోని మరిడమ్మతల్లి ఆలయం వద్ద భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 20న ముత్యాలమ్మతల్లికి ఉపవాసం చెప్పడం, దేవరను తిప్పనున్నట్టు పేర్కొన్నారు. 21న ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, ముగ్రాటలతో తల్లికి చల్లదనం చేస్తారన్నారు. 22 నుంచి 27వ తేదీ వరకు ఆలయ దమ్మల అర్చకులతో గ్రామంలో ఘటాల ఊరేగింపు, 28న అమ్మవారి అనుపు సంబర ఉత్సవం జరుగుతుందని వివరించారు.

అంబాభవానీకి చల్లదనం


ఆలయ నూతన కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రంగిరీజువీధిలో ఉన్న అంబాభవానీ ఆలయంలో మంగళవారం రాత్రి చల్లదనం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు(రాజు), గౌరవాధ్యక్షులుగా గుజ్జారు ఆనంద ప్రసాద్, దేవత్రాసె జనార్దనరావు, సెక్రటరీగా పతంగె ఆనంద స్వరూప్, జాయింట్ సెక్రటరీగా బాసుటగర్ చంద్రశేఖర్, ట్రెజరర్‌లుగా కంభాయతుఘర్, వి.వి.ఎస్.ఎస్.ఎన్.కుమార్‌రావు, సభ్యులుగా పతంగే జోగారావు, కె.విఠల్‌రావు, బి.షణ్ముఖరావు, బి.సురేష్, కె.జనార్దనరావు, డి.సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

ఘనంగా షిర్డీసాయి తిరువీధి



బలగలోని షిర్డీసాయి మందిరం 22వ వార్షికోత్సవం సందర్భంగా పురవీధులలో తిరువీధి ఉత్సవం ఘనంగా బుధవారం నిర్వహించారు. ముందుగా సాయి విగ్రహానికి పాలాభిషేకం, నూతన వస్త్రధారణ, పుష్పాలంకరణ చేశారు. విష్ణు సహస్రనామ పారాయణలు సామూహికంగా జరిగాయి. సాయంత్రం షిర్డీ సాయి మందిరం నుంచి 108 కలశాలతో బాబావారి ఉత్సవ మూర్తితో కలసి భజన బృందం, మేళతాళాలతో తిరువీధి ఉత్సవం జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
–శ్రీకాకుళం కల్చరల్

వైభవంగా గ్రామదేవత ఉత్సవాలు


అసిరిపోలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం


వీధిలో ఏర్పాటు చేసిన సీతారాముల ఉత్సవ విగ్రహాలు


ప్రత్యేక ఆకర్షణగా మార్కండేయ చిత్రం

- ప్రత్యేక ఆకర్షణగా ఉత్సవ విగ్రహాలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కమళాయిపుట్టుగ-లండపుట్టుగ గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో ఒడిశా కళాకారులు తయారు చేసిన ఉత్సవ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీధుల్లోని ముఖ్య కూడలిల్లో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను ఉత్సవాలకు వచ్చిన భక్తులు సందర్శిస్తున్నారు. సంబరాల్లో భాగంగా బుధవారం పొందూరుకు చెందిన మహిళల కోలాటం, ఒడిశాకు చెందిన యువతీ, యువకుల గారడీ విన్యాసాలు అందరినీ అలరించాయి. గ్రామదేవతను ప్రత్యేక పల్లకిలో అలంకరించి బొరివంక సన్నాయి మేళం మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. ఉత్సవ విగ్రహం

కేసరపడలో..

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామదేవత సింధుపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ నెల 13 సోమవారం నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడోరోజైన బుధవారం కూడా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేపట్టారు. అమ్మవారితోపాటు కాళికావేషధారణ, వివిధ ఆటలు ప్రదర్శించారు. మరోవైపు విద్యుత్ దీపాలంకరణతో వీధులన్నీ సుందరంగా తయారయ్యాయి. గ్రామంలో నీటి అవసరాలు తీర్చడం కోసం ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.


కంచిలి:ఊరేగింపులో కాళికా ప్రదర్శన


కంచిలి: కేసరపడలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

శ్రీరాములుకు ఘన నివాళి


శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: సీపీఎం నాయకులు బమ్మిడి శ్రీరాముల ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీకి చెందిన పలాస మండల నాయకులు నెయ్యిల గణపతిరావు అన్నారు. కాశీబుగ్గ సీపీఎం కార్యాలయంలో శ్రీరాములు సంతాప సభ బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉద్యమాలు జరిగే సమయంలో శ్రీరాములు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటమే కాకుండా ప్రజల కోసం జైలు జీవితం గడిపారని, గిరిజన రైతాంగ ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఢిల్లేశ్వరి, జన్ని భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరరావు, గోరు భాస్కరరావు పాల్గొన్నారు.

పోలీసు పికెట్ల పరిశీలన


పోలీసు పికెట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

ఆమదాలవలస: నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పిక్కెట్లను డీఎస్పీ వై.శృతి బుధవారం పరిశీలించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఆమదాలవలస పోలీస్ సర్కిల్ పరిధిలో కుద్దిరాం, ఐజే నాయుడు కాలనీ, దన్నాన్నపేట గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కుద్దిరాం, ఐజే నాయుడు కాలనీలో ఉన్న పోలీసు పికెట్లను డీఎస్పీ పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికలు వస్తాయి, పోతాయని వాటి కోసం తగాదాలలో తలదూర్చి కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

సారవకోట: మండలంలోని చీడిపూడి రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం ధనుంజయ్ రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందుగా ఎకరాకు 12 కేజీల నవధాన్యాల విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. అనంతరం 45 రోజుల తర్వాత దమ్ముపట్టి నీటిలో ముగగనివ్వాలన్నారు. తద్వార నేల గొల్లబారుతుందని, నేల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచుకుంటుందని తెలియజేశారు. నేలలో ఉండే సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కనుక రైతులు నవధాన్యాల సాగుపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. ఆయనతో పాటు ఎన్‌ఎఫ్‌ఏ బాబాజీ, మాస్టర్ ట్రైనీ టీవీ రమణ, యూనిట్ ఇన్‌చార్జి మోహన్, రమణమ్మ, రోహిణి, ప్రకాశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.